విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 25, సెప్టెంబరు 2025

అసెంబ్లీ సాక్షిగా మోసపూరిత మాటలు
ముఖ్యమంత్రి మానుకోవాలి
వైద్య విద్యను పేదలకు దూరం చేస్తున్న ఎన్‌డీఏ సర్కార్
సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున

విశాలాంధ్ర-అనంతపురం రూరల్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీ సమావేశాలలో మోసపూరిత మాటలు మాట్లాడుతూ ప్రజలను దగా చేస్తున్నారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున మండిపడ్డారు. బుధవారం జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ...వైద్య విద్యను పేదలకు దూరం చేసే విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ బడుగు బలహీన వర్గాలు ప్రభుత్వ విద్యా సంస్థలో వైద్య విద్యను అందని ద్రాక్షలా తయారు చేసేందుకు ముఖ్యమంత్రి పిపిపి విధానాన్ని రాష్ట్రంలో తీసుకువచ్చారని ఆరోపించారు. మీ కుమారుడు ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగలం పాదయాత్రలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో వైద్య విద్యను సగం ప్రైవేట్ పరం చేసేందుకు జీవో నెంబర్ 107, 108 తీసుకువస్తే మన ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే 100 రోజుల్లో ఆ జీవోలను రద్దు చేస్తామని ఇచ్చిన హామీ ఇచ్చారని.. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయిన గత ఎన్నికల్లో మీరు ఇచ్చిన హామీలలో భాగంగా వైద్య విద్యకు శాపంగా మారిన జీవోలను రద్దు చేయకపోగా వైద్య విద్యను పేదలకు అందని ద్రాక్ష లాగా పిపిపి విధానం తీసుకువచ్చి వైద్య విద్యను పేదలకు దూరం చేస్తున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. కేంద్రం, రాష్ట్రంలో డబల్ ఇంజన్ సర్కారని మాట్లాడుతున్న మీరు ఇవాళ రాష్ట్రంలో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపకుండా ఉన్నారనేది నిజం కాదా రాష్ట్రంలో పరిశ్రమలు సాగునీటి ప్రాజెక్టులు విద్య వైద్యం పూర్తిగా ప్రైవేటు చేతుల్లోకి అప్పజెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాబోయే కాలంలో చదువుకోవాలన్న వైద్యం చేయించుకోవాలన్నా లక్షల కోట్ల రూపాయలు కావాల్సిన అవసరం అవుతుందని పేర్కొన్నారు..రెండు పార్టీలు అధికార పక్షం ప్రతిపక్ష పార్టీలు సవాళ్లు విసురుకోవడానికే ఉన్నారని ఎద్దేవా చేశారు. వైద్య విద్యను ప్రైవేటీకరణ చేస్తే ప్రజా ఆందోళన పెద్దఎత్తున పూనుకుంటామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఓట్ల దొంగలను గద్దె దిగాలి..

విశాలాంధ్ర -రాయదుర్గం: ఓట్ల దొంగలు గద్దె దిగాలి అన్న నినాదంతో రాయదుర్గం పట్టణంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి గౌని ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం జరిపారు ప్రజల నుండి అనూహ్య స్పందన వచ్చిందని తెలియజేశారు. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, దేశ ప్రజల ఓటు హక్కు కాపాడటం కోసం పోరాటం చేయాల్సిన అవసరం వచ్చిందన్నారు. మన నాయకు లను మనం ఎన్నుకొనే స్వేచ్ఛ ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియాకు ఉందని.. అయితే ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఈసీఐ నిర్వహించే ఎన్నికలసంఘం ప్రధాని మోడీ చేతిలో బంది అయ్యారని మండిపడ్డారు. సిబిఐ ఈడి, ఇన్కమ్ టాక్స్, ఆర్బిఐ, స్టాక్ ఎక్స్చేంజ్ లాంటి అన్ని వ్యవస్థలు మోడీ బీజేపీ కోసం పని చేస్తున్నాయని మండిపడ్డారు. ఎన్నికల సంఘం కూడా బీజేపీ కోసమే పనిచేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు .ఈ విషయాన్ని రాహుల్ గాంధీ దేశం ముందు బయట పెట్టారన్నారు. ఇది పచ్చి నిజం అన్నారు. కర్ణాటకలోని మహాదేవపుర నియోజకవర్గాన్ని ఒక ఉదాహరణగా తీసుకున్నారని తెలిపారు. ఒక లక్ష దొంగ ఓట్లను నమోదు చేసి. అన్ని దొంగ ఫొటోలు, దొంగ పేర్లు, దొంగ చిరునామాలు. సృష్టించి మహారాష్ట్ర ఎన్నికల్లో సాయంత్రం 5 నుండి 6 గంటల మధ్యలో 60 లక్షలకు పైగా కొత్త ఓట్లు నమోదైనట్లు తెలిపారు ఇది ఎలా సాధ్యపడుతుందన్నారు. ఈ ఓట్లు ఎవరు వేశారు ? సీసీటీవీ ఫుటేజ్ ఎక్కడ ఉంది ? అంటే ఇచ్చిన ఈసీఐ దగ్గర ఏ ఆధారాలు లేవన్నారు. ఎన్నికలకు 5 నెలల ముందు కోటి ఓట్లకు పైగా కొత్త ఓట్లు నమోదు అయ్యాయి. ఇది అన్యాయం కాదా అని ప్రశ్నించారు ?కార్యక్రమంలో మహబూబ్ బాషా, రఫీక్, నాయకులు హనుమంత్ రెడ్డి, శ్రీనివాసులు, గోనభావి తిప్పేస్వామి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చౌక ధరల దుకాణ డీలర్లకు అధునాతన ఈ-పాస్ మిషన్లు పంపిణీ
▸ జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

విశాలాంధ్ర-అనంతపురం టౌన్: జిల్లాలోని 1,645 చౌక ధరల దుకాణ డీలర్లకు పాత ఈ-పాస్ మిషన్ల స్థానంలో అధునాతన ఈ-పాస్ మిషన్లు పంపిణీ చేయడం జరుగుతోందని జిల్లా జాయింట్ కలెక్టరు శివ్ నారాయణ్ శర్మ తెలిపారు. బుధవారం అనంతపురం నగరంలోని కృష్ణ కళామందిర్ లో ఆత్మకూరు, కూడేరు, గార్లదిన్నె మండలాలకు సంబంధించిన చౌక ధరల దుకాణ డీలర్లకు కొత్త ఈ పాస్ మిషన్లను జాయింట్ కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఆండ్రాయిడ్ మైక్రో కంట్రోలర్ ఆధారిత, ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ గుర్తింపు, టచ్ స్క్రీన్ ఇంటర్ ఫేస్ డేటా ప్రాసెసింగ్ కలిగిన ఈ క్రొత్త ఈ-పాస్ మిషన్ల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, ఖచ్చితమైన సేవలు ప్రతి లావాదేవి రియల్ టైంలో నమోదు అవుతుందన్నారు. జిల్లాలోని 1,645 చౌక ధరల దుకాణ డీలర్లకు ఈ క్రొత్త ఈ-పాస్ మిషన్లు ఈ నెల 27లోగా అందజేసి అందుకు సంబంధించిన శిక్షణను డీలర్లకు ఇవ్వాలని విజన్ టెక్ ఇంజినీర్లకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలోని తహసీల్దార్లు పౌరసరఫరాల డిప్యూటి తహసీల్దార్లు వారి వారి మండలాలలో క్రొత్త ఈ-పాస్ మిషన్ల పంపిణీ కార్యక్రమమును పర్యవేక్షించడం చేయాలని ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి జ్వరం కేసును పోర్టల్‌లో నమోదు చేయాలి
జిల్లా మలేరియా అధికారి డి.ఓబులు

విశాలాంధ్ర-అనంతపురం: ప్రతి జ్వరం కేసును ఐ డి ఎస్ పి పోర్టల్‌లో నమోదు చేయాలనిఇ జిల్లా మలేరియా అధికారి డి.ఓబులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక రెండవ రోడ్ .. ఇందిరా గాంధీ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మలేరియా, డెంగీ జ్వరాలకు సంబంధించి అక్కడి సిబ్బంది చేస్తున్న రక్త పరీక్షల గురించి ఆరా తీశారు. ప్రతి జ్వరం కేసు వివరాలను ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వేలెన్స్ ప్రోగ్రాం(ఐడిఎస్‌పి)పోర్టల్‌లో తప్పకుండా నమోదు చేయా లని ల్యాబ్ టెక్నీషియన్లను ఆదేశించారు. ల్యాబ్ రికార్డులను పరిశీలించారు. ఇందిరాగాంధీ పట్టణ ఆరోగ్య కేంద్రంలోని వార్డు సచి వాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి క్షేత్రస్థాయిలో గృహ సందర్శన చేసి జ్వరం కేసులను గుర్తించి రక్త నమూనాలు సేకరించి వాటిని ఐడిఎస్‌పి సర్వేలెన్సు ఫామ్‌లో ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. సచివాలయ ఆరోగ్య కార్యదర్శి హెల్త్ అసిస్టెంట్లు ప్రతిరోజు ఫీవర్ సర్వే నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ సూపర్వైజర్ నూర్ భాషా, జిల్లా మలేరియా కేంద్రంలోని ల్యాబ్ టెక్నీషియన్ రాఘువేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

పసిబిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం

విశాలాంధ్ర-కణేకల్లు : పోషణ మాసోత్సవాల సందర్భంగా కనేకల్ ప్రాజెక్టు పరిధిలో సిడిపిఓ నాగమణి ఆధ్వర్యంలో మహిళలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ నాగమణి మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యత, అనుబంధ పోషకాహారంపై అవగాహన కల్పించారు. బాలల ఆరోగ్యం, ఎదుగుదలలో తల్లిపాల ప్రాముఖ్యత ఎంతో ఉంది, శిశువుకు మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి, తల్లిపాల వలన శిశువుకు పూర్తి పోషణ, లభించడంతోపాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లి-శిశువు మధ్య అనుబంధం బలపడుతుందన్నారు. ఆరు నెలలు వయసు వచ్చిన తర్వాత తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారం ఇవ్వడం అవసరం, అన్నం, పప్పు, కూరగాయలు, పండ్ల రసాలు, గుడ్డు వంటి పదార్థాలు శుభ్రంగా పోషక విలువలతో తయారుచేసి చిన్న పరిమాణంలో మొదలుపెట్టి క్రమంగా పెంచాలని.. అలాగే అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే బాలామృతం కూడా తినిపించాలి అన్నారు. కార్యక్రమంలో కనేకల్ సెక్టార్ సూపర్వైజర్స్ ఈశ్వరమ్మ,గీత, శాంతమ్మ, తిరుపాల్ భాయ్ స్థానిక మహిళలు ఏఎన్ఎం సచివాలయ సిబ్బంది కమ్యూనిటీ, అంగన్వాడి వర్కర్ జ్యోతి పాల్గొన్నారు.

ఇంటింటా చెత్త సేకరణ చేస్తున్నారా.. లేదా..?
-ప్రజలను అడిగిన జెడ్పీ సీఈఓ



విశాలాంధ్ర-రాప్తాడు: గ్రామ పారిశుధ్య కార్మికులు రోజువారి ఇంటింటా చెత్త సేకరణ చేస్తున్నారా లేదా అని జెడ్పీ సీఈఓ జి.శివశంకర్ ప్రజలను ఆరా తీశారు. బుధవారం మండలంలోని బుక్కచెర్ల పంచాయతీలో ఎంపీడీఓ బి.విజయలక్ష్మితో కలిసి క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ గురించి విచారించారు. గ్రామంలో ఇళ్లకు నీటి సరఫరా అయ్యే విధానాన్ని వీధుల్లో ఇళ్ల వద్ద ఉన్న ప్రజలతో వివరాలను తెలుసుకున్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. సేకరించిన తడి, పొడి చెత్తను విక్రయించడం ద్వారా ఇప్పటి వరకు పంచాయతీకి ఎంత ఆదాయం సమకూరిందని ప్రశ్నించారు. సంపద తయారీ కేంద్రంలో తొట్టెల్లో వేసిన చెత్తలో వానపాములను వదిలి మరగబెట్టాలన్నారు. ఇంచార్జి డిప్యూటీ ఎంపీడీఓ సాకే ప్రేమకుమార్, పంచాయతీ కార్యదర్శి వి.మహేంద్ర రెడ్డి పాల్గొన్నారు..

ఘనంగా ముందస్తు దసరా వేడుకలు



విశాలాంధ్ర-జేఎన్టీయూఏ: అనంతపురంలోని అనంతలక్ష్మీ ఇంటర్నేషనల్ పాఠశాలలో దసరా వేడుకలు నిర్వహించారు. అనంతలక్ష్మి విద్యా సంస్థల చైర్మన్ అనంత రాముడు, కరెస్పాండెంట్ రమేష్ నాయుడు జ్యోతి ప్రజ్వలన గావించి పూజ ప్రారంభించారు. అనంతరం అనంత రాముడు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల జీవన ప్రమాణాలు, ఉన్నత విలువలకు, వికాసానికి నిలయంగా నిలుస్తాయన్నారు. పూజ అనంతరం విద్యార్థులకు మిఠాయిలును పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల సాంప్రదాయ వేషధారణలు, సాంస్కృతిక నృత్యాలు అందరిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల సీఏఓ నరసింహారావు , ప్రధానోపాధ్యాయురాలు శాలిని, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 5, 46 లక్షల ఎకరాల్లో ఈక్రాప్ నమోదు
జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ

విశాలాంధ్ర-ఉరవకొండ: జిల్లాలో ఇప్పటివరకు 5,46 ఎకరాలలో ఈక్రాపు నమోదు అయిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. బుధవారం ఉరవకొండ మండలం చిన్న ముష్టూరు, మోపిడి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల నిర్దేశించి మాట్లాడుతూ పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలపై అవగాహనతో పాటు యంత్ర పరికరాల రాయితీలపై గురించి రైతులకు వివరించారు. అనంతరం కంది పంటను పరిశీలించి కంది పంటలో వచ్చే చీడపీడలు మరియు తెగుళ్ళకు నివారణకు వాడవలసిన మందుల గురించి కూడా రైతులకు అవగాహన కల్పించారు. గ్రామస్థాయి వ్యవసాయ సహాయకులు నిర్దేశిత గడువు లోపల ఈ పంట బుకింగ్ పూర్తిచేసి ఈ కేవైసీ కూడా పూర్తి చేయవలెనని ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీఏ సత్యనారా యణ, మండల వ్యవసాయ అధికారి రామకృష్ణుడు సిబ్బంది పాల్గొన్నారు.

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పోటీ చేస్తుంది..

విశాలాంధ్ర- రాయదుర్గం: స్థానిక సంస్థల ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ చేస్తుందని జిల్లా కన్వీనర్ బి,వెంకటరమణ బాబు పేర్కొన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పంజాబ్ లో పాలనలో ఉంటూ, ఢిల్లీలో మూడుసార్లు ప్రభుత్వం ఏర్పరచి ఇప్పుడు ప్రతిపక్షంగా ఉంటూ, ఇంకొక మూడు రాష్ట్రాలలో ఎమ్మెల్యే లను కలిగి ఉన్న జాతీయ పార్టీ ఆమ్ ఆద్మీ పార్టీ అని అన్నారు. ప్రజల అత్యంత అవసరాలైన నాణ్యమైన విద్య, అందుబాటులోకి వైద్యం, 24 గంటల విద్యుత్తూ, త్రాగు నీరు, రోడ్లు, డ్రైనేజీలు, సానిటరీ, మహిళా సంరక్షణ, యువతకు ఉద్యోగ ఉపాధి కల్పన సామాన్యుడికి కూడా సమానంగా న్యాయం అనేవి ఎల్లవేళలా ఆమ్ ఆద్మీ పార్టీ అన్నారు. రాయదుర్గం గుంతకల్ అనంతపురం కళ్యాణదుర్ మున్సిపాలిటీ పంచాయతీల్లో ఆప్ పోటీ చేయబోతుందని తెలిపారు. కార్యక్రమంలో గుంతకల్ నియోజకవర్గం కన్వీనర్ మహమ్మద్ గౌస్, రామ్మోహన్, అబ్దుల్లా, మని, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విజయవంతంగా క్లస్టర్ లెవెల్ స్పోర్ట్స్ మీట్

విశాలాంధ్ర-గుంతకల్లు: పట్టణంలోని ఎస్.కే.పి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ మైభారత్ ఆధ్వర్యంలో, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సమన్వయంతో క్లస్టర్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆ నలుగురు సేవా సమితి వ్యవస్థాపకులు వి.మంజుల వెంకటేష్, ఎస్కెపి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జయ మారుతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ పలువురు అధ్యాపకులు హాజరయ్యారు. అనంతరం వారు బుధవారం మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని అన్నారు. క్రీడలు శరీరానికి బలాన్నీ, మనసుకు ధైర్యాన్నీ ఇస్తాయినీ ఓటమి మనోధైర్యాన్ని పెంచుతుందనిఇ, విజయం కృషిని సార్థకం చేస్తుందనీ అన్నారు. నిజమైన విజేత అంటే గెలిచేవాడు మాత్రమే కాదు, స్ఫూర్తినిచ్చేవాడు కూడా అని అన్నారు. ఈ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన యువతకు మెడల్స్, ప్రశంసా పత్రాలు, ట్రోఫీలు అందజేసి ఘనంగా సత్కరించారని అన్నారు.ఈ స్పోర్ట్స్ మీట్ విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, ఐకమత్యం, పట్టుదల వంటి విలువలను నింపుతూ, భవిష్యత్తు విజయాలకు మార్గం చూపిస్తుందని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

15 వేల సచివాలయాలను వైసీపీ నిర్మించింది

విశాలాంధ్ర-గుత్తి: రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో 15500 సచివాలయాలు నిర్మించిందని పి.ఎర్రగుడి సచివాలయం వద్ద వైసీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రెండుసంవత్సరాల కరోనా కష్టకాలన్ని భరించి ఇన్ని కొత్త సచివాలయాలు అధునాతన సౌకర్యాలతో లక్షా 50వేల సచివాలయ ఉద్యోగులను నియమించారు ప్రపంచంలో ఎక్కడా ఐదు సంవత్సరాల కాలంలో ఇంత అభివృద్ధి చేయలేదన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభంగా, వేగంగా, గ్రామ స్థాయిలోనే అందించడమే లక్ష్యంగా ప్రతి గ్రామం వార్డులో ఒక సచివాలయం ఏర్పాటు చేశామన్నారు. ఇందులో వివిధ శాఖల (రెవిన్యూ, పంచాయతీ, మునిసిపల్, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, మహిళా శిశు సంక్షేమం తదితర) సిబ్బంది పనిచేసేలా పోస్టింగ్‌లు ఇచ్చామన్నారు. ప్రతి సచివాలయంలో సగటున 10-12 మంది సిబ్బంది ద్వారా 500కు పైగా ప్రభుత్వ సేవలు (సర్టిఫికెట్లు, పెన్షన్లు, రేషన్, హౌసింగ్, విద్యుత్, పథకాల దరఖాస్తులు) అందించబడుతున్నాయని వివరించారు. గ్రామ సచివాలయం పట్టణ ప్రాంతాల్లో వార్డు సచివాలయంగా పనిచేస్థాయి గ్రామ, వార్డు స్థాయిలో భారతదేశంలో మొదటి సారిగా ఈ విధానం అమలులోనికి తెచ్చిందన్నారు. ప్రభుత్వ పథకాలు అమలులోకి తెచ్చిందని, ప్రజలకు ఇంటి వద్దకే అందించడం. పారదర్శకత, సమయపాలనతో సేవలు అందించడం.. ప్రతి 50 కుటుంబాలకు ఒక వాలంటీర్ ద్వారా సమాచారం, సాయం అందించడం చేసిందన్నారు. సులభంగా చెప్పాలంటే, రాష్ట్రంలో సచివాలయాలు అంటే ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించే కేంద్రాలు అన్నారు ఇలాంటి ఎన్నో పథకాలకు వైసీపీ ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల ఉపాధ్యక్షుడు రంగనాథ్ రెడ్డి మహాలింగ తదితరులు పాల్గొన్నారు.

కుక్కలు, పశువులు, కోతుల బెడద నుండి ప్రజలను కాపాడండి

విశాలాంధ్ర-ఉరవకొండ : ఉరవకొండలో రోజు రోజుకి అధికమవుతున్న కుక్కలు, పశువులు, కోతుల బెడద నుండి ప్రజలను కాపాడాలని ఆపద్బాంధవ ట్రస్ట్ వ్యవస్థాపకులు వేల్పుల మురళి, సామాజిక సేవా కార్యకర్తలు లెనిన్ బాబు, జమీల్ తెలిపారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈఓ గౌస్ సాహెబ్‌కు, ఇంచార్జి ఎంపీడీవో శంకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు పట్టణంలో గత కొన్ని నెలలుగా జరుగుతున్న విపత్కరమైన సంఘటనల పేపర్ కట్టింగులు, ప్రస్తుతం పలు వీధులలో కుక్కలు, పశువులు, కోతుల బెడద నుండి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఫొటోల రూపంలో వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా ప్రజలు రోజు ఏదో చోట ప్రజలు కుక్క కాటుకు గురవుతున్నారని.. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకుని ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని కోరారు,

వ్యవసాయ శాఖ మంత్రిని కలిసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-డి.హీరేహాళ్: మండలంలోని టిడిపి నాయకులు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడును కలిసి పూల మొక్కను ఇచ్చి గౌరవించారు. రాయదుర్గం మార్కెట్ యార్డ్ విషయమై కమర్షియల్ కాంప్లెక్స్‌లు రైతు విశ్రాంతిభవనం కనేకల్లులో అసంపూర్తిగా నిలిచిపోయిన సబ్ మార్కెట్ యార్డ్‌కు సంబంధించిన విషయం చర్చించారు. మంత్రి సానుకూలంగా స్పందించి రూ.4 కోట్ల రూపాయలు వారంలోపు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ యు.హనుమంత్ రెడ్డి, మండల్ కన్వీనర్ మోహన్ రెడ్డి మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ దొడగట్ట రామాంజనేయులు, నాగరాజు ధనుంజయ పాల్గొన్నారు.

గుమ్మగట్ట ఎంపీడీఓగా వి.జయరాములు

విశాలాంధ్ర-గుమ్మగట్ట : గుమ్మగట్ట మండల నూతన ఎంపిడిఓగా వి. జయరాములు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వజ్రకరూరు మండల పరిపాలనా అధికారి పోస్టు నుంచి పదోన్నతిపై ఇక్కడకి వచ్చారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ టోర్నీ

విశాలాంధ్ర-గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని గుత్తి ఆర్ఎస్ రైల్వే ఇన్స్టిట్యూట్ క్రీడా మైదానంలో ఈ నెల 25 నుంచి 27 వరకు రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. గౌతమీపురి ఫుట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీటీ, రైల్వే ఇన్స్టిట్యూట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రేమ్, సూరి మెమోరియల్ ఫుట్ బాల్ టోర్నమెంట్‌లో విన్నర్ ప్రైజ్ రూ.50వేలు, రన్నర్స్ కు రూ.25వేలు అందించనున్నారు. గుత్తి ఆర్ ఎస్ కు చెందిన సీనియర్ ఫుట్ బాల్ క్రీడాకారులు వసంత్ కుమార్ (ప్రేమ్), సురేష్ బాబు (ఫుట్ బాల్ సూరి) జ్ఞాపకార్థంగా మిత్ర బృందం నిర్వహిస్తున్న టోర్నమెంట్‌లో ఏపీ నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి భారీ జట్లు పాల్గొననున్నాయి. మరిన్ని వివరాలకు 9052653405, 9985678208, 9966560163, చరవాణి నంబర్లలో సంప్రదించాలని గౌతమీపురి ఫుట్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

ఆరోగ్య కేంద్రం ల్యాబ్ రికార్డులు తనిఖీ

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ డాక్టర్ పరమేష్ డాక్టర్ సాయి సుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్‌ను తనిఖీ చేశారు.. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఏఎన్ఎంలు గ్రామాల్లో తీసిన రక్తపుతలను తప్పక పరీక్షించాలని అన్నారు. జ్వరము అని వచ్చిన ప్రతి ఒక్కరికి డెంగీ, మలేరియా టైఫాయిడ్ చికెన్ గునియా రక్త పరీక్ష నిర్వహించాలన్నారు. అనంతరం ల్యాబ్ టెక్నీషియన్ శిరీషకు తగు సలహాలు వచ్చారు ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం విజయ్‌కుమారి ల్యాబ్ టెక్నీషియన్ శిరీష ఆశా కార్యకర్తలు సులోచన సునీత ముస్కినా పాల్గొన్నారు.

సమ్మెకు ప్రభుత్వ వైద్యులు సన్నద్ధం

విశాలాంధ్ర-తాడిపత్రి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రభుత్వ వైద్యులు సమ్మెకు సన్నద్ధం అవుతున్నామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుమన్ ఒక ప్రకటనలో చెప్పారు. బుధవారం డాక్టర్ సుమన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ తరఫున గౌరవ జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశామన్నారు. ఇన్ సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలన్నారు. టైమ్ బౌండ్ ప్రమోషన్లు అమలు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి బేసిక్ పే 50 శాతం ట్రైబల్ అలవెన్స్, నోషనల్ ఇన్‌క్రిమెంట్స్ మంజూరు, చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రామ్ కింద వైద్యులకు 5వేలు అలవెన్స్, నేటివిటీ, అర్బన్ ఎలిజిబిలిటీ, పీహెచ్సీ వైద్యులకు ఖచ్చితమైన పనిగంటలు, స్థిరమైన వారాంతపు సెలవులు ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో సమ్మె చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మార్పులు.. చేర్పులకు సహకరించండి

విశాలాంధ్ర-రాప్తాడు: ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు రాజకీయ పార్టీలు సహకరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రామ్మోహన్ సూచించారు. బుధవారం రాప్తాడు తహశీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన నియోజక వర్గంలోని అన్ని రాజకీయాల పార్టీల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. 18ఏళ్లు నిండిన యువతీ, యువకులను ఓటరు జాబితాలో చేర్పించి ఓటు హక్కు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో నియోజక వర్గంలోని హాయ్ ఓటరు నమోదు అధికారులు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రారంభం

విశాలాంధ్ర-శెట్టూరు: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా 1.4.2024 నుంచి 31.3.2025 సంవత్సరం వరకు రూ.13.40, 64,934 కోట్లలో జరిగిన పనులకు సంబంధించి నేటి నుంచి 16 గ్రామపంచాయతీలో సామాజిక తనిఖీలు ప్రారంభమైనట్లు ఎంపీడీవో జిలాన్ భాష, ఏపీవో నీరజ ఎస్ఆర్పి నీలకంఠ బుధవారం పేర్కొన్నారు. కూలీల వేతనాలకు సంబంధించి రూ.8.97.16.414 కోట్లు మెటీరియల్ రూపంలో రూ.4.43.48.520 కోట్ల పనులపై తనిఖీ చేయనున్నట్లు వివరించారు

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-పామిడి: పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం సచివాలయ సిబ్బందికి శిక్షణ స్వర్ణ ఆంధ్ర విజన్ 2047లో భాగంగా, 'జీరో పావర్టీ పి4' కార్యక్రమంపై సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ శిబిరాన్ని డిపిఓ నాగరాజు నాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి తేజోష్ణ, డిప్యూటీ ఎంపీడీవో అశ్వత్ నాయుడు, పాల్గొన్నారు. అనంతరం పామిడి గ్రామ పంచాయతీలోని పారిశుధ్య కార్మికుల కోసం 'సురక్ష శిబిరం' ఏర్పాటు చేశారు.

ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించాలి

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: గ్రామంలో ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్తను సేకరించాలని డిప్యూటీ ఎంపీడీవో దేవదాస్ గ్రీన్ అంబా సిడర్లకు సూచించారు. బుధవారం గోవిందవాడ గ్రామంలో చెత్త సేకరణను తనిఖీ చేశారు. చెత్త నుండి సంపద కేంద్రంలో వర్మి కంపోస్టు ఎరువు తయారు విధానంను పరిశీలించారు. చెత్తను రహదారులపై వేయకూడదన్నారు. పారిశుధ్య నిర్వహణపై సర్పంచి నాగవేణి వన్నూరు స్వామితో మాట్లాడారు. ప్లాస్టిక్ వస్తువులు విక్రయించరాదని దుకాణదారులను హెచ్చరించారు. ప్లాస్టిక్ వాడకంతో అనారోగ్యం వ్యాధులు వస్తాయని సూచించారు. ఇంటింటి చెత్త సేకరణ తీరు, పారిశుధ్య పనుల తీరును స్థానికులతో వివరాలు తెలుసుకున్నారు.

ఎమ్మెల్సీ సోమ్ వీర్రాజుకు రజక కార్పొరేషన్ డైరెక్టర్ ధన్యవాదాలు

విశాలాంధ్ర-తాడిపత్రి: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని బిజెపి ఎమ్మెల్సీ సోమ్ వీర్రాజు అసెంబ్లీలో ప్రస్తావించినందుకు రజక కార్పొరేషన్ డైరెక్టర్ వై.రామాంజినేయులు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో వై.రామాంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రజక కార్పొరేషన్ ఏర్పాటు చేసిన వెంటనే రజక కార్పొరేషన్ చైర్మన్ శ్రీమతి సి.సావిత్రి, డైరెక్టర్స్ ఆధ్వర్యంలో రాజమండ్రిలో రజక ఆకాంక్ష సభ నిర్వహించారు. ఈ సభకు కేంద్ర, రాష్ట్రమంత్రులు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు హాజరైనారు. రజక సమస్యలైన 50 సంవత్సరాలుగా రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాలకు విన్నవించిన, చట్టసభల్లో మా గొంతు వినిపించాలని ఈ సభకు హాజరైనటువంటి కూటమి ప్రభుత్వ పెద్దలను కోరగా కూటమి ప్రభుత్వంలో ఉన్నటువంటి ఎమ్మెల్సీ సోము వీర్రాజు బుధవారం అసెంబ్లీలో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే విషయంపై 14 రాష్ట్రలు, నాలుగు కేంద్ర పాలిత ప్రాంతాలు ఎస్సీ రిజర్వేషన్ పొందుతున్నాయి. తెలుగు రాష్ట్రాలలో రజకులను ఎస్సీ రిజర్వేషన్ జాబితాలో చేర్చే అవకాశాన్ని పరిశీలించాలని సభలో కోరడం సంతోషమైన విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు సుబ్బరాయుడు, నాగరాజు, నాగమునయ్య, ఓబులేసు, మల్లీ, రామకృష్ణ పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరి అలంకారంలో అమ్మవారు..

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి కళ్యాణదుర్గంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవిమత బాలా త్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రతిరోజు సాయంత్రం 6-30కి ద్వాదశ హారతులు 7-30పిఎంకు మహా మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పట్టణ ప్రజలు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాద ప్రసాదాలు స్వీకరించి శ్రీ వాసవీమాత ఆశీస్సులు పొందుతున్నారు. మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి పూజలు చేస్తున్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 25, సెప్టెంబరు 2025

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించండి..

కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్

విశాలాంధ్ర-కొత్తచెరువు: గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి స్వస్థ నారి - సశక్తి పరివార్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నెలకు రెండు లేక మూడు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఇప్పుడు ప్రత్యేకతగా ప్రధానమంత్రి స్వస్థ నారి - సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. కుటుంబానికి మహిళ వెన్నెముక లాంటిదని అన్నారు. మహిళ ఆరోగ్యంగా ఉంటే తన కుటుంబం.. అలాగే ఊరు జిల్లా దేశం కూడా బాగుంటుం దని అన్నారు. మహిళలకు ఆరోగ్యాలు సరిగా లేనప్పుడు వారు మాత్రమే వస్తారని.. ముందస్తుగానే పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. రొమ్ము క్యాన్సర్ రాకుండా, గైనిక్ సమస్యలు రాకుండా, టీబి, మధుమేహ వ్యాధి తదితర రోగాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పూర్వీకులు గతంలో ఆరోగ్యకరమైన రాగి సంకటి, జొన్న సంకటి తదితర ఆహారాన్ని తీసుకునేవారని ప్రస్తుతం మనలో ఆహార అలవాట్లు మారాయని, కష్టపడడం కూడా తగ్గిపోయిందని, అందువల్ల రోగాలు కూడా పెరిగిపోవడం జరుగుతోందని అన్నారు. మనమందరం మంచి లైఫ్ స్టైల్ ను అలవాటు చేసుకోవాలని అన్నారు.

మండల అభివృద్ధి కంటికి కనిపించని మాయ : సిపిఐ

విశాలాంధ్ర-నంబులపూలకుంట: మండల ప్రజలు ఎన్నో సమస్యలతో విలవిల్లాడుతుండగా అధికారుల నిర్లక్ష్యం, పాలకుల నిరాసక్త వైఖరి కారణంగా అభివృద్ధి అనే పదం కేవలం సమావేశాలకే పరిమితమైపోయిందని సిపిఐ నాయకులు తీవ్రంగా విమర్శించారు.మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏమాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదని, ఆసుపత్రి ఆవరణంలో పారిశుధ్యం పనులు చేపట్టి , సోలార్ లైట్లు అమర్చాలని బుధవారం సీపీఐ నాయకులు డిప్యూటీ ఎంపీడీవో మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి రాజారెడ్డి,వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జి రమణ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం ప్రజల కోసం కాకుండా పిచ్చి మొక్కల కోసం నిల్వ అయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. శుభ్రత లేకుండా రోగులు, గర్భిణీలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రజల ఆరోగ్యం కాపాడవలసిన ఆసుపత్రి స్వయంగా వ్యాధుల కేంద్రంగా మారడం దురదృష్టకరమని పేర్కొన్నారు.వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి పూట ఆసుపత్రికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. లక్షలాది రూపాయల నిధులు అభివృద్ధి పేరుతో ఖర్చవుతున్నాయని చెబుతున్నా శుభ్రత,వీధి దీపాలు వంటి ప్రాథమిక సదుపాయాలు లభించడం లేదని ప్రశ్నించారు. ఈ పరిస్థితి ప్రజలపై అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు.అభివృద్ధి కాగితం మీద కాక, వాస్తవ జీవితంలో కనిపించేలా అధికార యంత్రాంగం కృషి చేయాలని డిమాండ్ చేశారు.

హిందూపురంలో ఎస్సీడీపీ ఏర్పాటు

మంత్రి సవిత

విశాలాంధ్ర-పెనుకొండ: హిందూపురంలో చేనేతలకు ఉపాధితో పాటు ఆధునిక దుస్తుల తయారీలో శిక్షణిచ్చేలా కేంద్ర ప్రభుత్వం స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎస్సీడీపీ) మంజూరు చేసినట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ క్లస్టర్ తో 292 మంది నేతన్నలకు లబ్ది చేకూరనుందని వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నాలుగో బ్లాక్‌లో ఉన్న తన పేషీలో ఎమ్మెల్యే బాలకృష్ణతో కలిసి హిందూపురంలో స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రొగ్రామ్(ఎస్సీడీపీ) ఏర్పాటుపై రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి హిందూపురంలో స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రొగ్రామ్ (ఎస్సీడీపీ) ఏర్పాటుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. అంతకుముందు హిందూపురంలో ఎస్సీడీపీ ఏర్పాటు, నేతన్నలకు శిక్షణ అందించే విషయమై ఫ్యాషన్ డిజైనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ, రూ. 1.51 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఎస్సీడీపీకి కేంద్రం రూ. 1.44 కోట్లు, లబ్ధిదారులు రూ.7.12 లక్షలు వాటాగా ఇవ్వనున్నారన్నారు. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం(ఎన్.హెచ్.డి.పి) కింద కేంద్ర ప్రభుత్వం హిందూపురానికి ఎస్సీడీపీ మంజూరు చేసిం దన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా నేతన్నలకు ఉపాధి లభించడంతో పాటు వారికి నేటితరం అభిరుచులకు అనుగుణంగా దుస్తుల తయారీలో శిక్షణ ఇవ్వనుమన్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ స్పందిస్తూ, నూతన చేనేత దుస్తుల తయారీలో నిపుణులు, ఫ్యాషన్ డిజైనర్లతో నేతన్నలకు శిక్షణిచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. నేతన్నలకు గౌరవప్రదమైన జీవనం అందించడానికి ఎస్సీడీపీ దోహద పడుతుందన్నారు.

సిల్క్ శారీలో పట్టు ఎంతో కీలకమని మంత్రి సవిత తెలిపారు. సిల్క్ శారీ తయారీలో అవసరమైన పట్టు రాష్ట్రంలో ఉత్పత్తి కావడం లేదని, దీంతో బెంగుళూరు ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. రాష్ట్రంలో పట్టు సాగు పెంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు

భార్యను హత్య చేసిన నిందితుడి అరెస్టు..

విశాలాంధ్ర-పెనుకొండ: భార్యను హత్య చేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం పెనుకొండ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ రాఘవన్, ఎస్.ఐ, వెంకటేశ్వర్లూ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు, ఎఫ్.అల్తాఫ్ ఖాన్ ఏ ఫజ్లుల్లా అల్తాఫ్ న్యూ రెవిన్యూ కాలనీ, భార్యను అనేక రకాలుగా హింసలు పెట్టి హత్య చేశాడు. నిందితుడు మద్యానికి అలవాటు పడి, తన భార్యపై ఎవరోతోనో అక్రమ సంబంధం ఉడేమో అనే అనుమానాలతో వేధింపులు చేస్తూ ఉండేవాడు. భార్య ఘనగిరి స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తూ ఉండేది. 26.06.2025న నిందితుడు ఘనగిరి స్కూల్ వద్దకు వెళ్లి అక్కడ తన భార్య అతని పిల్లలను కుర్ది కాంప్లెక్స్, పెనుకొండలో ముద్దాయి నివాసం ఉంటున్న అద్దె గదిలో తీసుకోని వచ్చి అక్కడ తన భార్యతో గొడవ పడి, ఇనుప రాడ్‌తో తలపై గట్టిగ కొట్టడంతో ఆమెకు రక్త గాయాలు అయ్యాయి. పెనుకొండ ఆసుపత్రి లో అడ్మిట్ చేసి అక్కడ వైద్యులతో మా ఇంటి వద్ద మోటార్ సైకిల్‌లో స్కిడ్ అయ్యి పడినాము అని అబద్దం చెప్పి నిజాన్ని దాచిపెట్టాడు, మరల తన భార్యని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి చేర్పించి అక్కడ తన భార్యతో ఉండి మరల రాత్రి తన భార్య అక్క, బావ, వాళ్ళ అమ్మ హిందూపురం ఆసుపత్రి కి రాగ అది గమనించి నిందితుడు అక్కడి నుంచి తప్పించుకుని వెళ్ళిపోయాడు. గాయపడిన భార్యను సుమయ్య బాను ఏ సుమయ్య బేగం పెనుకొండ, హిందూపురం, అనంతపురం, బెంగళూరులోని ఆసుపత్రులకు తరలించారు. ఆమె గాయలకు తట్టుకోలేక, చికిత్స పొందుతూ 12.09.2025న బెంగళూరు విక్టోరియా ఆసుపత్రిలో మరణించింది. అప్పటినుంచి నిందితుడు పరారై వాంఛనీయుడిగా తిరుగుతున్నాడు. బుధవారం ఖచ్చిత సమాచారం ఆధారంగా పెనుకొండ పోలీసు సిబ్బంది నిందితుడిని పట్టుకొని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు, నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు, నిందితుడిని అదుపులోకి తీసుకున్న సీఐ రాఘవన్, ఎస్.ఐ వెంకటే శ్వర్లూ పోలీసు సిబ్బందికి అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర-ధర్మవరం: గత నెల9వ తేదీన ధర్మవరం ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో జీవనజ్యోతి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నఎస్. చరణ్, ఎనిమిదో తరగతి చదువుతున్న ఎస్. విక్కీ,ఆర్. వరుణ్ ఉత్తమ ప్రతిభను చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల హెడ్ మిస్ సిస్టర్ సుజాత తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 25,26 వ తేదీలలో కర్నూల్ జిల్లా లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆ విద్యార్థులను పాఠశాల హెడ్మాస్టర్స్,సిస్టర్ సుజాత , ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు తోటి విద్యార్థులు వినందన శుభాకాంక్షలు తెలియజేశారు.

వృత్తి విద్యతో నైపుణ్యాలు మెరుగు

విశాలాంధ్ర-ధర్మవరం : వృత్తి విద్యతో నైపుణ్యాలు మెరుగుపడతాయని హెడ్మాస్టర్ సుమనా తెలిపారు. బుధవారం మాట్లాడుతూ మా పాఠశాల జీవీజడ్పీగర్ల్స్ హై స్కూల్‌లో ధర్మవరం 9 వ తరగతి, 10 వ తరగతి విద్యార్థులను మెరుగు పరిచేందుకు వృత్తి విద్య ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఇందులో భాగంగా ఒకేషనల్ విద్యార్థులకు దసరా సెలవుల్లో సమగ్ర శిక్షణ 10 రోజులు ఇంటర్న్ షిప్ ప్రోగ్రాం జరుగుతుందని ఇంటర్నషిప్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందిస్తామన్నారు. అపారల్ అండ్ మాడెప్స్ (ఫ్యాషన్ డిజైనింగ్) ఒకేషనల్ ట్రెయినర్స్ పి.కళ్యాణి, జిల్లా ఒకేషనల్ కోఆర్డినేటర్స్ అయిన కృష్ణ చైతన్య, మధు, మనోహర్ ఇంటెన్షిప్ జరుగుతున్న ప్రాంతాలను సందర్శించి, విద్యార్థులకు తగిన సూచనలు అందించారని తెలిపారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర- ధర్మవరం : పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ చైర్మన్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సిరి కల్చర్ డాక్టర్ వెంకటస్వామి నాయక్, సిరికల్చర్ అధికారి చెన్నారెడ్డి విచ్చేశారు. అనంతరం మాట్లాడుతూ దేశం పట్ల సేవ చేసే స్ఫూర్తిని నింపడమే ఎన్ఎస్ఎస్ పోషించే కీలకపాత్ర అని తెలిపారు. 2022-2025 బ్యాచ్ వారికి ఉత్తమ వాలంటీర్లుగా కే.హారిక బిఏ,ఎస్. మారుతి బీకాం ,ఎంఎస్.చరణ్ సాయి బి ఏ లకు మెమొంటోలను సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ ప్రశాంతి పాల్గొని ఎన్ఎస్ఎస్ గూర్చి విద్యార్థులకు తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కుల్లాయి రెడ ఎన్ఎస్ఎస్ విలువను తెలియజేశారు. రేగాటిపల్లి రోడ్ శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలను ఎన్ఎస్ఎస్పిఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ కరణం హర్షవర్ధన్, ఇన్చార్జి రమేష్ ఎన్ఎస్ఎస్ ప్రాముఖ్యతను వివరిస్తూ కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో అధ్యాపకులు, విద్యార్థులు చెత్త ప్లాస్టిక్‌ను తొలగించారు.

ప్రధాని నరేంద్ర మోడీతోనే దేశం అభివృద్ధి

మెగా రక్తదాన శిబిరం ప్రారంభోత్సవంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు జీఎం శేఖర్

విశాలాంధ్ర-గోరంట్ల: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారథ్యంలో భారతదేశం నెంబర్ వన్‌గా అభివృద్ధి చెందుతుందని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనతి కాలంలోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో దూసుకుపోతుందని శ్రీ సత్య సాయి జిల్లా బీజేపీ అధ్యక్షుడు జీఎం శేఖర్ తెలిపారు, ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించు కొని దేశ వ్యాప్తంగా జరుగుతున్న సేవా పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా గోరంట్ల మండల భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు బోయ లక్ష్మి నారాయణ ఆధ్వర్యంలో గోరంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు మరియు రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ జీఎం శేఖర్ పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో 100 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు, యువకులకు రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా సర్టిఫికెట్ తో పాటు ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా కల్పించనున్నామని రెడ్ క్రాస్ చైర్మన్ జియం. శేఖర్ తెలిపారు,ఈ కార్యక్రమంలో విద్యార్థులు యువత పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు, ఈ కార్యక్రమంలో డాక్టర్ అఫ్తాబ్,వినోద్ కుమార్, అసెంబ్లీ కన్వీనర్ మేదర శ్రీనివాసులు, టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, మాజీ ఎంపీపీ నిమ్మల విద్యా ధరణి, మాజీ సర్పంచ్ నరేష్, ఉత్తమ రెడ్డి, నిమ్మల శ్రీధర్, జనసేన జిల్లా కార్యదర్శి సురేష్, షేక్ అజ్మతుల్లా, డైరెక్టర్ నబీరసూల్, అనిల్ కుమార్, సేవా పక్వాడ్ కార్యక్రమాలు ఇంచార్జ్ పూల గంగాధర్, కో ఇన్చార్జ్ వెంకటాచలం, శంకర్ రెడ్డి, నాగరాజు యాదవ్ , ముంతాజమ్మ, లక్ష్మి దేవమ్మ, కాచర్ల హరీష్ పాల్గొన్నారు.

టి.రెడ్డివారిపల్లిలో ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు సీపీఐ వినతిపత్రం

విశాలాంధ్ర-తలుపుల : మండలంలోని టి.రెడ్డి వారిపల్లి గ్రామ సమీపంలో పరంబోకు సంతతోపు 1173-1 విస్తీర్ణం 1.67 సెంట్లు ఆక్రమణకు గురైందని, ఆ ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులుకు సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. తక్షణమే ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఈశ్వరయ్య, సహాయ మండల కార్యదర్శి సిద్దయ్య, ఖాదర్‌బాషా అశోక్, హరి పాల్గొన్నారు.

సత్యసాయి శత జయంతి ఉత్సవాలు పటిష్టంగా నిర్వహించాలి

- కలెక్టర్ శ్యాం ప్రసాద్

విశాలాంధ్ర-పుట్టపర్తి : సత్యసాయి శతజయంతి వేడుకలు పటిష్టంగా నిర్వహించాలని, వసతులు, పారిశుద్ధ్య నిర్వహణ ఏర్పాట్లు ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని, అందరూ సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్లో వేడుకలకు సంబంధించి వివిధ శాఖల అధికారులు సత్యసాయి ట్రస్టు ప్రతినిధులతో సమీక్షించారు. కలెక్టర్‌తో పాటు ఎస్పీ సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సత్యసాయి ట్రస్టు ప్రతినిధులు చలం, డాక్టర్ నారాయణ్, ప్రభు రామేశ్వర్, రాజేష్ దేశాయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్షన్ మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిందని, రాష్ట్రం గర్వపడే విధంగా సమిష్టిగా అందరూ కలిసి విజయవంతం చేయాలన్నారు. దేశ విదేశాల నుంచి, పలు రాష్ట్రాల నుంచి భక్తులు, పర్యాటకులు, వీఐపీలు, వీవీఐపీలు పాల్గొంటారన్నారు. పారిశుద్ధ్య పరంగా, తాగునీరు, పరిశుభ్రత, మొబైల్ టాయిలెట్లు, వీధి దీపాలు, డస్ట్ బిన్నుల ఏర్పాట్లు, డ్రైనేజీ వ్యవస్థలు, ఫుడ్ కౌంటర్లు తదితర అంశాలపై దృష్టి పెట్టాలని, మునిసిపాలిటీ, పంచాయతీ కార్మికులను రప్పించి షిఫ్టులవారీగా 24 గంటలు విధులలో ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రవాణా సౌకర్యం రహదారుల మరమ్మత్తులు చేపట్టాలన్నారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పర్యావరణం దెబ్బతినకుండా ప్లాస్టిక్ని యంత్రణపై పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ, పటిష్టమైన భద్రత కోసం సమగ్ర సెక్యూరిటీ ప్లాన్ సిద్ధం చేస్తున్నామన్నారు. అత్యవసర వాహనాలు, సీసీ కెమెరాలు, డ్రోన్ టీముల ఏర్పాట్లు చేసి పర్యవేక్షిస్తామన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో పద్మావతి కళాశాల విద్యార్థినుల విజయ పరంపర

విశాలాంధ్ర-ధర్మవరం: శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ ప్రకటించిన 2వ, 4వ సెమిస్టర్ ఫలితాలలో స్థానిక ఎల్.పి. సర్కిల్ లోని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ సెకండ్ ఇయర్ బీకాం ,గ్రూపు నందు హజీరా, భాను:96.6 శాతము,చంద్రిక:95 శాతము,అమ్రిన్:94 శాతం, ద్వితీయ బీబీఏ గ్రూపు నందు అమృత వర్షిణి:91 శాతం, షబానా:89 శాతం, అపర్ణ:88 శాతము, ద్వితీయ బిఎస్సిగ్రూపులో శ్రీలక్ష్మీ ప్రసన్న:78 శాతం, జీవిత :75 శాతం, ప్రత్యూష: 75 శాతం, తృతీయ బీబీఏ, గ్రూపులో యాస్మిన్:94 శాతం, హిమబిందు :89 శాతం, కళ్యాణి : 87 శాతం, తృతీయ బీకాం, గ్రూపులో అనూష: 91 శాతం, జ్యోతి: 90 శాతం, మౌనిక:90 శాతము, తృతీయ బిఎస్సి, గ్రూపులో పి. ధరణి: 80 శాతం, అర్షియా:79 శాతం, వైష్ణవి:78 శాతంలతో యూనివర్సిటీ టాపర్స్‌గా నిలిచిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున అభినందించారు. కేవలం అత్యధిక మార్కులనే గాక ఓవరాల్ 100 శాతం రిజల్ట్స్‌ని ఏ కోణంలో విశ్లేషించిన" శ్రీ పద్మావతి"విద్యా వైభవం ప్రస్ఫుటంగా సాక్షాత్కరించిందని తెలిపారు. ఇంతటి ఘన విజయానికి కారణమైన అధ్యాపక బృందానికి శుభాకాంక్షలు తెలియ చేశారు.

బుక్కపట్నంలో చోరీ

విశాలాంధ్ర-బుక్కపట్నం: మండల కేంద్రమైన బుక్కపట్నం గ్రామంలో మంగళవారం రాత్రి ఘరానా చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో నివాసముంటున్న సబితమ్మ అనే మహిళా గత 15 రోజులుగా ఇంటికి తాళం వేసి కొడుకు దగ్గరికి వెళ్ళింది. ఈ క్రమంలోనే ఇంటిలో ఎవరూ లేరన్న విషయాన్ని గమనించిన దుండగులు మంగళవారం రాత్రి ఇంటి తాళం పగలగొట్టి ఇంటిలోనే దాదాపు 80 గ్రాముల బంగారు, 230 గ్రాముల వెండి దొంగలించినట్లు పోలీసులు తెలిపారు. కాక బాధిత కుటుంబ సభ్యులు 20 తులాల బంగారు, మూడు కేజీల వెండి, నగదు చోరీకి గురైనట్లు వాపోయారు.

మొరసనలపల్లిలో పల్లెబాట

విశాలాంధ్ర-చిలమత్తూర్ : ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు బుధవారం మొరసలపల్లి గ్రామ పంచాయతీలో ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు వీరయ్య ఆధ్వర్యంలో పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో తిరుగుతూ చేయవలసిన పనులను గుర్తించారు, రెవెన్యూ సమస్యలపై ప్రజల నుండి వినతులు స్వీకరించి పరిష్కారమయ్యేలా చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీనివాసులు, పంచాయతీ నాయకులు డిష్ ఆంజనేయులు, శ్రీరామ్ రెడ్డి, వేమనారాయణ, బయపరెడ్డి, కొండప్ప, గట్టు అంజి, మురళి, విజయలక్ష్మి, మంజునాథ్, విశ్వనాథ్ రెడ్డి, సురేంద్ర, కృష్ణమూర్తి, కుమార్, శ్రీరామ్ నాయక్, కందూరుపర్తి క్రిష్టప్ప, అధికారులు పాల్గొన్నారు.

వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు

విశాలాంధ్ర-ధర్మవరం: దసరా శరన్నవరాత్రుల మూడవ రోజు పట్టణంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామి వారు శ్రీ లక్ష్మి నరసింహ స్వామి అలంకరణలో దర్శనమిచ్చారు. దాతలుగా జగ్గా వంశీయుల కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అడహక్ చైర్మన్ చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్, ఆలయ ఈవో వెంకటేశులు పాల్గొన్నారు. దుర్గమ్మ తల్లి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణేశ్వరి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ఈవో వెంకటేశులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అధిక సంఖ్యలో భక్తాదులు పాల్గొన్నారు. కొత్తపేటలో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చకులు సుదర్శనాచార్యులు విశేష పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణపతి సచ్చిదానంద దత్త జాన బోధ సభా ట్రస్ట్ సభ్యులు, వాలంటీర్లు మహిళా మండలి పాల్గొన్నారు. పుట్టపర్తి రోడ్డులో గల శ్రీ త్రిపుర సుందరీ దేవి సమేత శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో అమ్మవారు అన్నపూర్ణేశ్వరి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీ షిరిడి సాయిబాబా సేవా సమితి కమిటీ వారు అన్ని ఏర్పాట్లను విజయవంతంగా కొనసాగించారు. పట్టణంలోని గాంధీ నగర్ లో శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారు అన్నపూర్ణేశ్వరి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. రామ్‌నగర్లో గల శ్రీ చౌడేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణేశ్వరి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయాలు భక్తాదులతో కీట కీట లాడాయి. అంతేకాకుండా ఆలయాలలో పోలీసుల బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు.

జగన్‌ను కలసిన మధుమతి రెడ్డి, దీపిక వేణు రెడ్డి

విశాలాంధ్ర-హిందూపురం : వైసీపీ అధ్యక్షులు పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డిని, తాడేపల్లి పార్టీ సమీక్ష సమావేశాలలో రాష్ట్ర కార్యదర్శి రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుతి రెడ్డి, హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపిక వేణు రెడ్డి బుధవారం పాల్గొని, వైయస్ జగన్ మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పలు విషయాలపై చర్చించారు.

బొలెరో ఢీకొని యువకుడు మృతి

విశాలాంధ్ర-నంబులపూలకుంట: మండల పరిధిలో జిల్లా సరిహద్దు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం - పల్లెనివారిపల్లి గ్రామానికి చెందిన పల్లెని గంగాధర్ నాయుడు (35) గాలివీడు మండలం ఇందుకూరుపల్లి వద్ద గల పెట్రోల్ బంక్‌లో డీజిల్ తీసుకుని వస్తున్నాడు. ఈ క్రమంలో వెలిగల్లు సమీపంలోని జిల్లా సరిహద్దు వద్ద మలుపు దగ్గర వెనుక నుండి టమోటా లోడుతో వస్తున్న బొలెరో వాహనం అతడిని ఢీకొట్టింది. గంగాధర్ నాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆరోగ్య అవగాహన సదస్సు

విశాలాంధ్ర-తలుపుల: మండల పరిధిలో ఉన్న పులిగుండ్లపల్లి గ్రామ పంచాయతీ నందు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో బుధవారం స్వస్థ నారి అభియాన్ ప్రోగ్రాం నిర్వహించారు. తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ అఫ్తాఫ్ డాక్టర్ ఆశ్రిత మాట్లాడుతూ రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భశయ క్యాన్సర్, కిషోర బాలికలు ఆరోగ్య పరీక్షలు, క్షయ వ్యాధి లెప్రసి పరీక్షలు నిర్వహించామన్నారు. స్త్రీలు శారీరకంగా మానసికంగా, ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటంబం ఆరోగ్యంగా ఉండే అవకాశలు మెండుగా ఉంటాయు అనే ఉదేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్టోబర్ 2 తేది వరకు నిర్వహిస్తున్నాయని చెప్పారు. డాక్టర్ లక్ష్మీనరసయ్య హెల్త్ సూపర్వైజర్స్ రామ్మోహన్ శంకరమ్మ ఏఎన్ఎంలు సుజాత పాల్గొన్నారు

రోడ్డును మరమ్మతు చేయించిన జడ్పీటీసీ

విశాలాంధ్ర-అగళి : మండల పరిధిలోని కిత్త అగళి నుంచి రామపురం వరకు అద్వానంగా ఉన్న రోడ్డును జడ్పిటిసి ఉమేష్ తన సొంత డబ్బులతో జెసిబితో మరమ్మత్తు చేయించారు. కిత్త అగళి నుంచి రామాపురం వరకు అద్వానంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కాలినడక వెళ్లాలన్నా, ద్విచక్ర వాహనంపై వెళ్ళాలన్న ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో జడ్పిటిసి ఉమేష్ తన సొంత డబ్బులతో జెసిబిని సమకూర్చి రోడ్డును మరమ్మత్తు చేయించారు. జడ్పిటిసి ఉమేష్ కు ఆ రెండు గ్రామాల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

డీలర్లుకు రేషన్ స్మార్ట్ కార్డులు అందజేత

విశాలాంధ్ర-అమడగూరు: మండల రెవెన్యూ కార్యాలయంలో బుధవారం తాసిల్దార్ రామనాథ రెడ్డి, సిఎస్‌డిటి రమాదేవి ఆధ్వర్యంలో మండల పరిధిలోని 29 చౌక ధాన్య డీలర్లకు 9639 రేషన్ స్మార్ట్ కార్డులు పంపిణీ చేయడం జరిగిందని ఎమ్మార్వో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిఎస్డబ్ల్యు సిబ్బంది డీలర్లు కూటమి ప్రభుత్వం నాయకులు ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి డోర్ డెలివరీ కార్యక్రమాన్ని నిర్వహించాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ తాసిల్దార్ మహేశ్వర్ రెడ్డి, ఆర్ఐ రామక్రిష్ణరెడ్డి వీ.ఆర్.ఓ.లు, డీలర్లు పాల్గొన్నారు.

సర్వేల ఒత్తిడి తగ్గించాలి

విశాలాంధ్ర-నంబులపూలకుంట : మండలంలోని రైతు సేవా కేంద్ర సిబ్బంది సచివాలయ సర్వేలపై ఒత్తిడి తగ్గించాలని తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం ఈ పంట నమోదు కార్యక్రమం కొనసాగుతుందని, పై అధికారులు ఈసారి పంట వేసిన భూములే కాకుండా బీడు భూములను కూడా నమోదు చేయాలని ఆదేశించారని తెలిపారు. మండలంలో మొత్తం 44 వేల ల్యాండ్ పార్సిల్స్, రైతుల నుండి ఈ పంట నమోదు ఎరువుల సరఫరా, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, సాయిల్ శాంపిల్స్, పంట కోత ప్రయోగాలు, పొలం పిలుస్తోంది, ఈ పంట కేవైసీ, హార్టికల్చర్ స్కీమ్స్ ఒత్తిడి ఉందన్నారు.

వీఆర్‌ఓలు చేసిన ఫిర్యాదులో వాస్తవం లేదు..

65**విశాలాంధ్ర-పుట్టపర్తి :** పుట్టపర్తి ఆర్డిఓ సువర్ణపై వీఆర్వోలు కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదులో ఎటువంటి వాస్తవం లేదని రాయలసీమ బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు కొట్టాల శ్రీరాములు తీవ్రంగా ఖండించారు.బుధవారం ఈ విషయంపై శ్రీరాములు అధ్యక్షతన కొంతమంది రైతులు కలిసి కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. నిజాయితీగల ఉన్నతాధికారి,తన విధుల పట్ల పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న క్రిందిస్థాయి అధికారులను మందలించడంలో తప్పేమీ లేదన్నారు. భూ సమస్యలు,ప్రజా సమస్యల పట్ల వీఆర్వోలు చిత్తశుద్ధితో పని చేస్తే ప్రజలు ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. రైతులను తాసిల్దార్ కార్యాలయాల చుట్టూ, కొంతమంది వీఆర్వోలు ఏళ్ల తరబడి వారి కాళ్లకు చెప్పులు అరిగేలా తిప్పుకుంటున్నారే తప్ప సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ప్రభుత్వం ఆదేశించిన పనులను చూడాల్సిన బాధ్యత ఉన్నతాధికారులకు ఉంటుందని ఈ తరుణంలోనే విధుల పట్ల నిర్లక్ష్య ధోరణిలో ఉన్న వీఆర్వోను ఆర్డీవో సువర్ణ పలుమార్లు హెచ్చరించడం జరిగిందన్నారు. దీనిని దురుద్దేశ్యంగా భావించిన వీఆర్వోలు కలెక్టరుకు ఫిర్యాదు చేయడం సమంజసం కాదన్నారు ఆరోపణలు చేసిన వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

పంచాయతీ పురోగతి 1.0 వెర్షన్‌పై శిక్షణ

విశాలాంధ్ర-గుడిబండ: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పురోగతి సూచిక 2.0 వెర్షన్‌పై, అన్ని గ్రేడ్ల కార్యదర్శులకు, మండల పరిధి అధికారులకు పెనగొండ డివిజనల్ అభివృద్ధి అధికారి రామ కృష్ణయ్య ఎంపీడీవో కేశవరెడ్డి, భూ రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ రాం భూపాల్ రెడ్డిల ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణ తరగతులు బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆర్జిఎస్ఏ యాన్యువల్ యాక్షన్ ప్లాన్ 2025-26పై అవగాహన కల్పించడం జరిగింది. అలాగే పీఏఐ పోర్టల్ ద్వారా గ్రామ పంచాయతీల అభివృద్ధి వాటి సరళీకృత ఆర్థిక విధానాలు క్షుణ్ణంగా వివరించారు. పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా మన పథకాలు ఉండాలన్నారు. అందరికి సురక్షితమైన మంచినీటి సరఫరా గ్రామాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించే విధంగాను, గ్రామాలలో పేదరిక నిర్మూలన కోసం మొత్తం 17 లక్ష్య సాధన విధానాలను కూడా మనం ప్రవేశ పెట్టుకోవడం జరిగిందన్నారు. దీంతో సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని ఆయన వివరించారు.

స్మార్ట్ కార్డులు ఎంతో ఉపయోగకరం

విశాలాంధ్ర-ముదిగుబ్బ : ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను మండలంలోని బండ్లపల్లి కొట్టాలలో లబ్ధిదారులకు ఎంపీపీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిత్యావసర వస్తువులు పొందడంలో పారదర్శకత, సులభతరం కోసం ఈ కార్డులు వినియోగంలోకి తెచ్చినట్లు తెలిపారు. స్మార్ట్ కార్డులు సులభంగా భద్ర పరుచుకోవచ్చని, వాటి ద్వారా రేషన్ సరుకులు సక్రమంగా అందుబాటు లోకి వస్తాయని పేర్కొన్నారు. లబ్ధిదారులు ఈ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, గురువారం 25, సెప్టెంబర్ 2025

నూతన జిల్లా కలెక్టర్‌ని కలిసిన గోవింద్ నాయక్

విశాలాంధ్ర-ఉరవకొండ: అనంతపురం జిల్లా నూతన కలెక్టర్ ఓ.ఆనంద్ ఐఏఎస్ ని వైసీపీ జిల్లా ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు వి.గోవింద్ నాయక్ బుధవారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గిరిజన తండాలలో మురికి కాలువల వల్ల విష జ్వరాలు ప్రబలుతున్నాయని సరైన వసతులు లేక గిరిజనులు చాలా ఇబ్బందులు పడుతున్నారని వారికి సరైన మంచినీటి సదుపాయం మరియు రోడ్ల సమస్యలు తీర్చాలని అన్నారు. ఇలా ఎన్నో రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యలు పరిశీలించి వారికి న్యాయం చేయాలని అలాగే జిల్లాని అన్ని రంగాల్లో కూడా అభివృద్ధి పథంలో నడిపించాలని గోవింద నాయక్ జిల్లా కలెక్టర్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమానాయక్, తిరుమలేస్ నాయక్, దాసునాయక్, రూప నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శరన్నవరాత్రుల మహోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరం: దసరా శరన్నవరాత్రుల సందర్భంగా పట్టణములోని పలు దేవాలయాలలో అమ్మవారు ఆయా రోజులవారీగా భక్తాదులకు విశేషాలంకరణలో దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా మూడవ రోజు శ్రీనివాస నగర్ లోగల శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారు వరహాప తార అలంకారములో దర్శనమిచ్చారు. తొగట వీధిలోని శ్రీ శాంత కళా చౌడేశ్వరి దేవి ఆలయంలో గౌరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. తదుపరి పట్టణంలోని అనంతరం కెపిటి వీధిలో గల వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారు శ్రీ అన్నపూర్ణేశ్వరి దేవి అలంకరణ లో దర్శనమిచ్చారు. పట్టణంలోని మార్కెట్ వీధిలో గల భద్రావతి భావన రుషింద్రుల స్వామి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణేశ్వరీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. పట్టణంలోని యాదవ వీధిలో గల గాయత్రీ దేవి ఆలయంలో అమ్మవారు సంతాన లక్ష్మీదేవి అలంకారణములో దర్శనమిచ్చారు. భక్తాదులతో ఆలయాలు మారుమోగాయి.

భక్తాదులతో శరన్నవరాత్రుల మహోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరం: దసరా శరన్నవరాత్రుల సందర్భంగా పట్టణములోని పలు దేవాలయాలలో అమ్మవారు ఆయా రోజులవారీగా భక్తాదులకు విశేషాలంకరణలో దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా పట్టణంలోని సాలే వీధిలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణేశ్వరి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అదేవిధంగా సాలే వీధిలోని అంబా భవాని దేవాలయంలో అమ్మవారు సంతాన లక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. తదుపరి పట్టణములోని పుట్లమ్మ గుడిలో గాయత్రీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. పట్టణములోని శివానగర్, కేశవ నగర్ లోని శ్రీ విజయ చౌడేశ్వరి దేవి ఆలయంలో అన్నపూర్ణేశ్వరి దేవి అలంకరణ గావించారు. పట్టణంలోని టీచర్స్ కాలనీలో చౌడేశ్వరి దేవి అమ్మవారు బ్రహ్మచారిణీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. పట్టణములోని శివానగర్లో గల శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు.ఆలయాలు భక్తాదులతో కిట కిటలాడాయి. పట్టణంలోని ఆలయములలో పోలీసులు కూడా బందోబస్తు ఏర్పాటు చేశారు.

స్వస్తి నారి స్వశక్తి అభియాన్ సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-ఉరవకొండ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్తి నారీ స్వశక్తి అభియాన్ కార్యక్రమం మహిళలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉందని ఈ కార్యక్రమాన్ని మహిళలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని వజ్రకరూరు మండలం చాబాల గ్రామ సర్పంచ్ మల్లెల జగదీష్ తెలిపారు. బుధవారం గ్రామంలో జరిగిన కార్యక్రమాన్ని సర్పంచ్ మల్లెల జగదీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, అందరూ కూడా వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. స్వస్తి నారీ స్వశక్తి పరివార్ అభయాన్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ పద్మ మాట్లాడుతూ, గర్భిణీ స్త్రీలకు, బీపీ, షుగర్ ఉన్నవారికి, పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి విజయకుమార్ సూపర్వైజర్ సరోజమ్మ, వైద్య సిబ్బంది పావని,వరలక్ష్మి,చంద్ర, అంగన్వాడి కార్యకర్త చంద్రమణి, సోమేశ్వరి, శశికళ, సరోజ, ఆశా కార్యకర్తలు లింగమ్మ, ధనలక్ష్మి, మల్లిక మహిళలు పాల్గొన్నారు.

పీ4తో బంగారు కుటుంబాలకు చేయూత

విశాలాంధ్ర-బొమ్మణహాల్: పీ-4 ద్వారా గ్రామీణప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతం కావడంతోపాటు ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని ఎంపీడీవో విజయ భాస్కర్ , తహసిల్దార్ మునివేలు, పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఆదేశాలతోమండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు పీ-4 అమలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారద ర్శకత, ప్రజా భాగస్వామ్యం, సమయ పాలన, సమర్థత పాటించాలన్నారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వం అందించే పథకాలతో పాటు బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని వారికి చేయూత అందించాలన్నారు. ఈ కార్యక్రమం ఉద్దేశం చేయవలసిన పనులు గురించి ట్రైనర్ మాస్టర్లు వృద్వి, ఎర్రి స్వామి, కావ్య, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి, వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో దేవదాసు,, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

విశాలాంధ్ర-కొత్తచెరువు: కొత్త చెరువులో ఇటీవల నాలుగు రోడ్లల్లో ఆక్రమణలను తొలగించారు. అయితే ప్రభుత్వం రూ.రెండు కోట్ల నిధులను మంజూరు కావడంతో ఒక కిలోమీటర్ రోడ్డు త్వరలో వేయడం జరుగుతుందని. ఆర్ అండ్ బి జేఈ వన్నూరు స్వామి, తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా తొలగించిన ప్రాంతంలో మరియు రోడ్డును కలిపి ఫోర్ లైన్ రహదారిని వేయడం జరుగుతుందన్నారు. ఈ పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న అక్రమ భవనాలను కూడా కోర్టు అనుమతి రాగానే వాటిని తొలగిస్తామన్నారు.

తల్లి జ్ఞాపకార్థం ఆశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రం లోని, కమలపాడు రోడ్డు, రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో బండారు చంద్రశేఖర్, భార్య కీ"శేనాగేంద్రమ్మ వారి కుమారుడు అశోక్ కుమార్, కోడలు రూప శ్రీ, మనవరాలు ఓంకారేశ్వరి వీరి కుటుంబము అశోక్ తల్లి జ్ఞాపకార్థం అగాపే ఆశ్రమంలో బుధవారం అన్నదానం ఏర్పాటు చేశారు. కుటుంబ సభ్యులు రామచంద్రుడు, అక్కలు చౌడమ్మ, జయలక్ష్మి బావలు హరిప్రసాద్,రంగస్వామి పుల్లయ్య, పద్మావతి పాల్గొన్నారు. ఇందు నిమిత్తమై ఆశ్రమ నిర్వాహకులు బత్తల ప్రసాద్, ఆశ్రమంలోని వారంతా వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యేక పూజలు నిర్వహించిన డివిజనల్ అభివృద్ధి అధికారి



విశాలాంధ్ర-గుడిబండ: గుడిబండ మండల కేంద్రంలోని శ్రీ తుమ్మల మారమ్మ దేవికి పెనుగొండ డివిజనల్ అభివృద్ధి అధికారి రామకృష్ణయ్య ఎంపీడీవో కేశవరెడ్డి స్థానిక సర్పంచ్ జి.బి.కరుణాకర్ గౌడ్‌లతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ క్రమంలో ఆలయ అర్చకులు కుంకుమార్చన నైవేద్యం పుష్పలంకరణ తదితర పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదం అందజేశారు.

యాజమాన్య పద్ధతులు పంట దిగుబడులు సాధ్యం

విశాలాంధ్ర-గుంతకల్లు: మండలం లోని దోసలోడికి, సంఘాల గ్రామాల లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారిలీనా వసుంధర బుధవారం మాట్లాడుతూ రైతులు వివిధ పంటలు సాగు వివరాలు యజమాని పద్ధతులపై రైతులకు వివరించడం జరిగిందినీ అన్నారు. ముఖ్యంగా కందిలో మారుక మచ్చలు, పురుగులు ఆకు పూతను పిందెను ఆశించి గూడు చేసి గూడులో విత్తనాలను తిని కాయలను డొల్ల చేస్తుందని అన్నారు. దీనికి నివారణ ఇండెక్స్ కార్డ్ 1ఎం.ఎల్, షనోలిన్ 2 ఎమ్ ఎల్ లు నీటి నీ కలిపి పిచికారి చేయాలని,కాండం తొలిచే పురుగు నివారణకు ఫ్యూనన్ 3జి గుళికలు 10 కేజీలు ఒక ఎకరానికి చల్లుకోవాలని అన్నారు. సుడిదోమ నివారణకు కాళీబాటిల్ 2 ఎంఎల్‌లకు 200 తూర్పు పడమర గా తీసుకోవాలని అన్నారు. పై మెట్రోజిన్ 50 0.5 లేక డైనో డిఫ్యూనన్ టోకెన్ 20 0.4జి ఒక లీటర్ నీటి కలిపి మొదలపై పురుగు యందు పడే విధంగా పిచికారి చేయాలని రైతులకు వివరించడం జరిగిందినీ అన్నారు. మండల వ్యాప్తంగా 118 మెట్రిక్ యూరియా వచ్చిందని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో రాజ్యలక్ష్మి వి ఏఏ అఖిల్ రైతులు రామకృష్ణారెడ్డి, నాగభూషణం, రామ్మోహన్ రెడ్డి ,యశోద, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముళ్ళచెట్ల తొలగింపు

విశాలాంధ్ర-గోరంట్ల: గోరంట్ల పట్టణం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణం లో ముళ్ళపొదలు,పిచ్చి మొక్కలతో వైద్య ఆరోగ్య సిబ్బంది,108 సిబ్బంది,రోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారూ, రాత్రి వేళల్లో పాములు వస్తుండటంతో మెడికల్ ఆఫీసర్ అఫ్జబ్ మరియు డాక్టర్ వినోద్ కుమార్ లు టీడీపీ మండల నాయకులు, నిత్యశ్రీ జ్యువెలర్స్ యజమాని నిమ్మల శ్రీధర్ కు సమస్యను తెలిపారు,దీంతో నిమ్మల శ్రీధర్ వెంటనే స్పందించి,జెసిబి వాహనం ద్వారా ముళ్ళ చెట్లు తొలగించేందుకు శ్రీకారం చుట్టారు, ఆసుపత్రి ఆవరణం జేసీబీ ద్వారా తొలగించారు. దీంతో నిమ్మల శ్రీధర్ దాతృ త్వానికి, ప్రజాసేవకు వైద్య సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణ చౌదరి, ఉత్తమ రెడ్డి,మైనార్టీ నాయకులు షేక్ అజ్మతుల్లా, డైరెక్టర్ నబీరసూల్, రవినాయక్, అమానుల్లా, కురుబ మహేంద్ర, మామిడి కాయల హరి ప్రసాద్, కలీమ్ ఖాన్, మహబూబ్ బాషా,నరేంద్ర,ముని,మహేష్‌తో పాటు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒకే ఈతలో రెండు దూడలు

విశాలాంధ్ర-నల్లమాడ: మండలంలోని గోపేపల్లి గ్రామానికి చెందిన ప్రమీలమ్మ మహిళా రైతుకు చెందిన ఆవు రెండు దూడ లకు జన్మ నిచ్చినట్లు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మహిళా రైతు మాట్లాడుతూ తొమ్మిది నెలలు మోసి జన్మ నిచ్చిన గోమాత మాకుటుంభాన్ని పోషించినట్లు తెలిపారు. ఒకే ఈతలో రెండు దూడలలో ఒక పేయి,ఒక మగ దూడను జన్మించినట్లు తెలిపారు. గ్రామస్తులు వింతగా హాజరై సంతోషించారు.

స్మశాన వాటిక స్థలం పరిశీలించిన జడ్పీటీసీ

విశాలాంధ్ర - అగళి : మండల కేంద్రంలో స్మశాన వాటికకు అనువైన స్థలాన్ని జెడ్పిటిసి ఉమేష్ బుధవారం పరిశీలించారు. ప్రతి గ్రామం లోనూ స్మశాన వాటిక స్థలాన్ని సమకూర్చాలని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అధికారులు ఆదేశించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మండల కేంద్రంలో స్మశాన వాటిక స్థలం ఏర్పాటుకు సంబంధించిన ప్రాంతాన్ని జడ్పిటిసి ఉమేష్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి ఉమేష్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో స్మశాన వాటికకు స్థలాన్ని ఏర్పాటు చేయడానికి ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదేశించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి సెల్ నాయకులు రాజగోపాల్ నాయకులు తదితరులు ఉన్నారు.

గర్భవతులు పౌష్టిక ఆహారం తీసుకోవాలి

విశాలాంధ్ర-పుట్టపర్తి: గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సిడిపిఓ జయంతి పేర్కొన్నారు. బుధవారం ఎనుమలపల్లి-2 అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సుజాత ఆధ్వర్యంలో పోషణ పక్వాడ - బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ జయంతి మాట్లాడుతూ పోషకహారం యొక్క ప్రాముఖ్యతను గురించి, మంచి ఆరోగ్యనికి దోహదపడే ఆకుకూరలు తీసుకోవాలన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రం లో మొక్కలను పెంచి అందంగా తీర్చి దిద్దాలన్నారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ కార్యకర్తలు రామేశ్వరి, లక్ష్మీ, ఆయాలు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగంపై క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ

విశాలాంధ్ర-గుత్తి: పట్టణం మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో బుధవారం వ్యవసాయ అధికారి కార్యాలయంలో "పంటకోత ప్రయోగము లను నిర్వహించేందుకు క్షేత్రస్తాయి సిబ్బందికి శిక్షణ, సూచనలు అందించారు. ఈ సంవత్సరంలో పంటకోత ప్రయోగములను నిర్వహిం చేందుకు సూచనలు తెలిపారు. పంటకోత ప్రయోగాల ద్వారా వచ్చిన ఫలితాలు జిల్లా, రాష్ట్రస్థాయిలో పంట దిగుబడి అంచనా వేయుటకు, పంటల వారిగా ఉత్పత్తి అంచనా ఉత్పత్తివేయుటకు, ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన (పి.ఎం.ఎఫ్.బి.వై అమలుపై కరువు మండలాలను ముందస్తు అంచనాలు తెలియచేయుటకు, వ్యవసాయానికి సంబంధించిన రాష్ట్రీయ, జాతీయ స్థూల ఆదాయమును అంచనా వేయుటకు, పంటల వారిగా ప్రభుత్వ నిర్ణయాలు తీసుకోవడం చాలా ప్రధాన పాత్ర పోషిస్తుందని ఏ ఎస్ ఓ శ్రీనివాస నాయక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో గుత్తి ఏ డి ఏ వెంకటరాముడు, ఎంసిబ్బంది ఏ ఓ ముస్తాక్ అహమ్మద్ ఏ ఎస్ ఓ శ్రీనివాస్ నాయక్ గుత్తి ఆర్ యస్ కె సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర - అగళి : మండల పరిధిలోని బొమ్మరసనపల్లి గేటు వద్ద శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపం సమీపంలో విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి చిక్కప్పయ్య కుటుంబీకులు నిర్మించ తలపెట్టిన ఆంజనేయ స్వామి దేవాలయం నిర్మాణానికి బుధవారం మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి భూమి పూజ చేశారు, ఈ కార్యక్రమానికి జడ్పీటీసీ ఉమేష్, సింగల్ విండో అధ్యక్షులు కుమార్ స్వామి,కన్వీనర్ తిప్పేస్వామి ఎంపీపీ రేణుక కమరాజ్, జిల్లా వాల్మీకి సంఘ ఉపాధ్యక్షులు కోడిపల్లి రమేష్, మండల ప్రధాన కార్యదర్శి జయప్ప, తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అధ్యాత్మికతను పెంపొందించు కోవాలని సూచించారు. దేవాలయం నిర్మాణాన్ని త్వరితగతినా పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు. భూమి పూజ కార్యక్రమం అయిన తర్వాత అతిథులను ఘనంగా సన్మానించారు, ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సన్నమ్మ రంగప్ప, స్థానిక టిడిపి నాయకులు లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

గంధం అలంకరణలో కన్యకాపరమేశ్వరి

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండల పరదిలోని గోవిందవాడ గ్రామంలో శ్రీ వాసవికన్యకా పరమేశ్వరి అమ్మవారికి దసరా నవరాత్రుల సందర్భంగా మూడవ రోజు బుదవారం విశేష పూజలు నిర్వహించారు. గంధంఅలంకరణలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత అవతారంలో భక్తులుకు దర్శనం ఇచ్చారు.

బాలయ్య పీఏ బాలాజికి ఆహ్వాన పత్రికను అందిస్తున్న దర్గా కమిటీ నిర్వహకులు

విశాలాంధ్ర - హిందూపురం : లేపాక్షి మండలం నాగేపల్లి వద్ద వెలసిన హజరత్ వీర్ భక్తర్ వలి ఉరుసు మహోత్సవాలు అక్టోబర్ 4, 5, 6 వతేదిలో మూడు రోజుల పాటు జరుగుతాయని, కుల మతాలకు అతీతంగా జరిగే ఉత్సవాలలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని, దర్గా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ముక్తియర్, శ్రీనివాస్ రెడ్డిలు పిలుపునిచ్చారు. ఉత్సవంలో భాగంగా బుధవారం పూలకుంట సర్పంచ్ మంజునాథ్ తో కలిసి స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తి గత కార్యదర్శి బాలాజికి, మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ కు, కమిషనర్ మల్లికార్జున కు ఇతర పట్టణ ప్రముఖులతో పాటు అధికారులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగేపల్లి వద్ద వెలసిన హజరత్ వీర్ భక్తార్ వలి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా 4వ తేది శనివారం రాత్రి నూరని సందల్ కార్యక్రమం, ఆదివారం గందోత్సవ, సోమవారం రాత్రి హుబ్లీకి చెందిన షాబాజ్ ధరాజ్, టుంకురుకు చెందిన అర్షియా నాజ్ లచే ఖవ్వాలి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాలకు ఈ ప్రాంత ప్రజలతో పాటు కర్ణాటక, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తు లందరికీ అవసరమైన ఏర్పాట్లను చేశామన్నారు. కుల మతాలకు అతీతంగా జరిగే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు కలీం, షరీఫ్, జబి, మహబూబ్ భాషతో పాటు అహలే సున్నతుల్ జమా త్ అధ్యక్షులు మహబూబ్ దౌలా, కోశాదికారి షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

గర్భవతులకు, రోగులకు మెరుగైన వైద్య సేవలు

విశాలాంధ్ర-యాడికి: జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈ.వి. దేవి ఆదేశాల మేరకు యాడికి మండల పరిధిలోని రాయలచెరువు ప్రభుత్వ వైద్యశాల వైద్యులు అప్పయ్య, ఈ.కె. దేవరాజన్ ఆధ్వర్యంలో బుధవారం చందన పుప్పాల గ్రామాల్లో నారి-స శక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రెండు గ్రామాల కలిపి మొత్తం 30 మంది గర్భిణీలు, 60 మంది బీపీ, షుగర్ ఉన్నవారు, 10 మంది క్యాన్సర్ అనుమానితులు, 20 మంది దగ్గు, జ్వరం లాంటి లక్షణాలతో బాధపడుతున్నవారు వైద్య సేవలు పొందారు. వారికి ఆరోగ్య పరీక్షలు, మందులు, అవసరమైన సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో ఎం పి హెచ్ ఎస్ జె.షబ్బీర్, ఐసిడిఎస్ సూపర్వైజర్ శంషాద్ బేగం, ఎం పి హెచ్ ఎస్ షాహిదా బేగం ఎమ్ ఎల్ హెచ్ పీ లు, ఏఎన్ఎం లు ఆశా కార్యకర్తలు చందన, సర్పంచ్ నాగలక్ష్మమ్మ పుప్పాల సర్పంచ్ దేవేంద్ర పాల్గొన్నారు.

పేదరికం రూపుమాపేందుకు పీ4

విశాలాంధ్ర-ఉరవకొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 విధానం అమలు కోసం అందరం కలిసి ముందుకునడుద్దామని ఉరవకొండ ఇన్చార్జి ఎంపీడీవో శంకర్ కోరారు. బుధవారం ఉరవకొండలో ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో గ్రామ సచివాలయ సిబ్బంది, అధికారులతో నిర్వహించిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. డిప్యూటీ ఎంపీడీవో సతీష్, సిపిఏపీ యూనిట్ యంగ్ ప్రొఫెషనల్ దిలీప్ పాల్గొన్నారు. ఇంచార్జ్ ఎంపీడీవో మాట్లాడుతూ సమాజంలో దిగువస్థాయిలో ఉన్న 20 శాతం ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేసి, పేదరికం లేని వ్యవస్థను స్థాపిద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్ర 2047లో భాగంగా పీ-4 విధానం అమలు చేస్తున్నారన్నారు. పరస్పర సహకారం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునన్నారు. అనంతరం వివిధ సర్వేల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు.

హౌసింగ్ అధికారులు అవగాహన

విశాలాంధ్ర-పెనుకొండ: పట్టణం లోని వెలుగు కార్యాలయంలో హౌసింగ్ అధికారులు అవగాహన నిర్వహించారు.ప్రధానమంత్రి ఆవాస్ యోజన దరఖాస్తుల వేగవంతమైన ధృవీకరణ,మున్సిపాలిటీలో 1500 మంది దాకా స్థలం ఉన్నవారు గృహం మంజూరు కొరకు దరఖాస్తు చేసుకోవచ్చు అని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్.2.0పై గృహనిర్మాణం మంజూరు కొరకు ఇంటింటికి విస్తృత అవగాహన కల్పించాలని ఒక్కో గృహానికి 2.50 లక్షల రూపాయల మంజూరు అవుతుందని పేర్కొన్నారు.ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 కింద స్పెషల్ ఫోకస్ గ్రూప్ లబ్ధిదారులను చేర్చండి.పిఎం సూర్య ఘర్ ప్రయోజనాలు: పిఎంఎవై-ఎల్‌యు లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ పథకంవడ్డీ సబ్సిడీ పథకం కింద గృహ రుణంపై సబ్సిడీని సులభతరం చేయండి.తక్కువ ఆదాయ గృహాలకు క్రెడిట్ రిస్క్ గ్యారెంటీ ఫండ్ ట్రస్ట్ గురించి అవగాహన ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0ప్రయోజనాలను అందించడానికి బలహీన, దుర్బల వర్గాలను చేరుకోవడం. రుణ మేళాల ద్వారా లబ్ధిదారులకు గృహ రుణాలు ఇళ్లను పూర్తి చేయడానికి వీలు కల్పించడం కొత్తగా పూర్తయిన గృహాల గృహ ప్రవేశం కార్యక్రమాలు ఉంటాయని హౌసింగ్ అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ సి ఎల్ టి సి రఘునాథ్, శివకుమార్, శ్రీనాథ్, రొద్దం ఎ ఇ ఖాజా మొయిద్దీన్, డిఏ యోగీశ్వరయ్య వర్క్ ఇన్స్పెక్టర్ శశి,టిడిపి పట్టణ పార్టీ కన్వీనర్ శ్రీరాములు, మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, ఎన్డీఏ కూటమి నాయకులు, మహిళా సంఘాల ఆర్పీలు, సచివాలయం అధికారులు, హౌసింగ్ లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు దర్శనం ఇచ్చిన పెద్దమ్మతల్లి

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని శ్రీ పెద్దమ్మతల్లికి శరన్నవరాత్రులలో భాగంగా మూడవరోజు గురువారం శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆశ్వీజ శుద్ధ చవితి సందర్భంగా ఉదయం నుండి వేద పండితులచే హోమాధి కార్యక్రమాలు నిర్వహించారు ప్రత్యేక పూలు పండ్లతో దేదీప్యమానంగా ఆలయ ప్రాంగణాన్ని అరటిపట్టలచే మామిడి ఆకులతో టెంకాయ పట్టలతో పచ్చదనం ఉట్టి పడేలా అలంకరించారు పెద్ద ఎత్తున వచ్చిన భక్తాదులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. యాడికి పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధి కమిటీ వారి ఆధ్వర్యంలో చాలా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

మహిళలల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

విశాలాంధ్ర-నంబులపూలకుంట: మండలంలోని మరికొమ్మదిన్నె సచివాలయం పరిధిలో "స్వస్థ్ నారి - సశక్త్ పరివార్ అభియాన్" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో స్థానిక మహిళలకు ఆరోగ్య పరిరక్షణ, కుటుంబ శ్రేయస్సు, స్త్రీ శక్తివంతీకరణ అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక కుటుంబం ఆరోగ్యంగా ఉండాలంటే ముందుగా మహిళలు ఆరోగ్యంగా ఉండాలని, సమతుల్య ఆహారం, శుభ్రమైన తాగునీరు, సమయానికి టీకాలు, గర్భిణీ స్త్రీలకు సరైన వైద్య పరీక్షలు చాలా అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్వో నాగలక్ష్మి,హెల్త్ అసిస్టెంట్ విజయ్ కుమార్ , ఎం ఎల్ హెచ్ పి భువనేశ్వరి, ఏఎన్ఎం దేవి, ఆశా వర్కర్లు పుష్ప, కవిత, ఖుషిదా, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఆదేశాలతో విద్యుత్ సమస్య పరిష్కారం

విశాలాంధ్ర-గోరంట్ల: మండలంలోని జీవం వాండ్లపల్లి వద్ద గల ఎన్టీఆర్ కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా నెలకొన్న విద్యుత్ సమస్యను రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్ సవితమ్మ ఆదేశాల మేరకు బుధవారం ట్రాన్స్కో అధికారులు పరిష్కరించారు, ఈ సందర్భంగా విద్యుత్ పోల్స్ తో పాటు వైర్లు వీధిలైట్లు ఏర్పాటు చేశారు, విద్యుత్ పనులను మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణ చౌదరి, మాజీ సర్పంచ్ నరేష్ కుమార్ తదితరులు వెళ్లి పరిశీలించి పనులు చేయించారు,ఈ సందర్భంగా కాలనీవాసులు మంత్రి సరిత అమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

వృత్తి విద్య కోర్సులతో భవిష్యత్తుకు బాటలు

విశాలాంధ్ర-రాప్తాడు: విద్యార్థి దశ నుంచే వృత్తివిద్య కోర్సులపై అవగాహన పెంచుకోవడం వల్ల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చని ఒకేషనల్ టీచర్ మౌనిక అన్నారు. 30మంది రాప్తాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్షేత్రస్థాయిలో పది రోజుల ఇంటర్నషిప్ శిక్షణలో భాగంగా మొబైల్ రిపేరీ, విద్యుత్తు పరికరాల రిపేరీ, నీటి సరఫరా మోటార్ల పనితీరుపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. తరగతి గదిలో చదువుకునే విద్యతోపాటు స్వయం వృత్తిపరమైన విద్యను నేర్చుకోవడం వల్ల భవిష్యత్తులో సొంతంగా సంపాదించుకోవడానికి ఉపాధి దొరుకుతుందన్నారు.

పట్టణ అధ్యక్షులుగా సురేంద్ర రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

విశాలాంధ్ర-పుట్టపర్తి : శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మున్సిపాలిటీలో ఉన్న గ్రామ,వార్డు సచివాలయ సిబ్బంది అందరూ కలిసి మున్సిపల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగస్తుల నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పుట్టపర్తి మున్సిపాలిటీ (పట్టణ) గ్రామ,వార్డు సచివాలయాల అధ్యక్షులుగా సురేంద్ర రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా శివశంకర్ రెడ్డిని, ఉపాధ్యక్షులుగా పి.అనిత, జాయింట్ సెక్రటరీ హిదయత్, ట్రెజరర్ హరినాయక్, జనరల్ సెక్రటరీలుగా మాలిక్,అరుణ లను ఎన్నుకున్నారు. ఉద్యోగస్తుల సలహా మార్గదర్శకులుగా వెంకటరమణ, అశ్వర్థనారాయణ, శ్రీలత లను నియమించారు.ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా సురేష్, హేమలత, రాజేష్ ,రాజశేఖర్ ,నరసింహులు, కవిత,నవీన్, మదన్ గోపాల్‌లను ఎంపిక చేయడం జరిగింది.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ కమిటీ సభ్యులు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరి దేవి అన్నపూర్ణేశ్వరిగా అలంకరణ

విశాలాంధ్ర-పెనుకొండ: మండల పరిధి లోని చంద్రగిరి గ్రామంలో శ్రీగిరి శక్తి పీఠంలో వెలసిన మహేశ్వరి దేవి నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా బుధవారం శ్రీగిరి మహేశ్వరి అమ్మవారిని అన్నపూర్ణేశ్వరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించామని, అమ్మవారికి అర్చనలు విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించా మని శ్రీగిరి శక్తి పీఠాధిపతి దేవేంద్ర స్వామి తెలిపారు. భక్తాదులందరికి తీర్థప్రసాదాలు అన్న ప్రసాదం పంపిణీ చేశామని దేవేంద్ర స్వామి తెలిపారు.

కలెక్టర్‌ని కలిసిన ఏపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షులు

విశాలాంధ్ర-బొమ్మనహాల్: అనంతపురం జిల్లా నూతన కలెక్టర్ ఓ.ఆనంద్‌ని బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఏపీ ఎస్ ఈ ఏ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్ భాస్కర్, ఏపీ యుఎస్, జిల్లా అధ్యక్షులు ఎర్రిస్వామి, ఉద్దేహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడుజి. ఆది శేషయ్య, ఏపీఎస్ఈఏనాయకులు శ్రీనివాసులు, మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్కు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.